క్లుప్తంగా

4 నుంచి పింఛన్ల పంపిణీ

శావల్యాపురం: సామాజిక పింఛను ఈ నెల నుంచి రూ.3వేలు ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య సోమవారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ 4వ తేదీ నుంచి పింఛనుదారులకు వలంటీర్లు నగదు పంపిణీ చేస్తారని తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 5,872 మంది వివిధ రకాల పింఛనుదారులు ఉన్నారని చెప్పారు. నూతనంగా 79 పింఛన్లు మంజూరు అయ్యాయని, కొందరవి పరిశీలనలో ఉన్నట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛను మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నాదెండ్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు వివరాల మేరకు.. గణపవరం గ్రామానికి చెందిన టీవీ మెకానిక్ బీరంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం రాత్రి రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. మేడికొండూరు మండలం దుర్గాపాలేనికి చెందిన షేక్ బషీర్ మిత్రుడితో కలిసి తన ద్విచక్రవాహనంపై వెళ్తూ.. శ్రీనివాసరావును ఢీకొన్నారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు కాలికి తీవ్రగాయం కాగా, 108 అంబులెన్స్‌లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

నలుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: మండలంలోని అప్పాపురం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని బసికాపురం గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలూరిపేట మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తూ బసికాపురం గ్రామం వద్ద రోడ్డుపై నిలబెట్టిన ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో బాలినేని వెంకటేష్(25) మృతిచెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



నరసరావుపేట టౌన్: ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. బరంపేట వినాయకుని గుడి వద్ద సుమారు 50 సంవత్సరాల వయస్సు గల మహిళ రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతిరాలి సమాచారం తెలిసిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ భాస్కర్ తెలిపారు.

నవనీత అలంకరణలో వేంకటేశ్వరస్వామి

సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదు లాంతర్ల సెంటర్‌లోని శ్రీ రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి వెన్నతో (నవనీతం) అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం

అచ్చంపేట: ఏడాదిగా కొనసాగుతున్న ప్రేమికుల ప్రేమాయణం ఎట్టకేలకు సఫలీకృతమైంది. గ్రామపెద్దల సమక్షంలో ఆదివారం రాత్రి ఇద్దరూ ఒక్కటయ్యారు. మండలంలోని కొండూరు గ్రామం, బీసీ కులానికి చెందిన చొప్పరపు శ్రీనివాసరావు, అదే గ్రామం ఎస్సీ కులానికి చెందిన సుంకిశాల దీపిక గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలిసి కట్టడి చేశారు. అయినా వారి ప్రేమాయణం ఎంతమాత్రం తగ్గలేదు. ఒకరిపై ఒకరు మరింత ఇష్టం పెంచుకున్నారు. పెద్దలను ఒప్పించిన తరువాతే వివాహం చేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఇరువురు ఏడాదిగా వారి వారి పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేశారు. గ్రామ పెద్దలు కల్పించుకుని శ్రీనివాసరావు తండ్రి స్వామి, దీపిక తండ్రి ఏసురత్నంలతో సంప్రదించి ఒప్పించారు. ఆదివారం రాత్రి ఇరువురి బంధువుల సమక్షంలో గ్రామంలోని చర్చిలో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిపించారు. ప్రేమికులు ఇరువురు మేజర్లు కావడంతో ఎలాంటి అభ్యంతరాలు లేకుండా వివాహం సజావుగా జరిగింది. కార్యక్రమంలో వరుని తరుపు గణపవరపు రామమూర్తి, బలరాజు సైదరాజు, చొప్పరపు శ్రీను, యేళ్ల ఆంజనేయులు, వధువు తరుపు ఆనంద్‌కుమార్, నవనీతరావు హాజరయ్యారు. ఇద్దరు దండలు మార్చుకుని ఒక్కటయ్యారు.

జగనన్న పాలనలో ప్రతి రోజూ పండగే



ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలకు గజమాలతో సత్కారం



ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు నేతల శుభాకాంక్షలు



కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాజీ మంత్రి కాసుకు ఎమ్మెల్యే గోపిరెడ్డి శుభకాంక్షలు

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీగా సంబరాలు

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రతి రోజూ పండుగేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు పట్టణంలోని పాత పశువుల సంత ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొని, భారీ కేక్ కట్ చేశారు. క్రేన్‌తో తెచ్చిన గజమాలతో ఆయనను సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవినేని శంకరరావు, తలతోటి రాణి, పిడతల ఝాన్సి, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముక్తా వాసు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్–1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్–2 విడదల కమలేంద్ర, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాల పార్టీ అధ్యక్షులు గుత్తా యాములయ్య, గంటా శంకర్, మద్దూరి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు యండ్లూరి సతీష్, కనపర్తి వెంకట్రావు భారీ గజమాలతో స్వాగతం పలికారు. కేక్ కట్ చేసి, సంబరాలు ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఐదు మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో కొత్తపేటలోని లాయర్స్ స్ట్రీట్ కిక్కిరిసిపోయింది. 2024లో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామాల్లో పాడిపంటలతో కళకళలాడాలని ఎమ్మెల్యే బొల్లా ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి పరిపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరలా అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని కోరారు.

నూతన సంవత్సర ప్రత్యేక ప్రార్థనలు

శావల్యాపురం: నూతన సంవత్సర ప్రత్యేక ప్రార్థనలు మండలంలో సోమవారం నిర్వహించారు. స్థానిక విమోచన ప్రార్థన మందిరంలో మత బోధకుడు సీహెచ్ ఏహెజ్కేలు ఏసుక్రీస్తు సందేశాన్ని వివరించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. న్యాయవాది గంధం వెంకటేశ్వర్లు ఒంటరి మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

ఎంపీడీవో కార్యాలయంలో ..

శావల్యాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లును అధికారులు సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, జూనియర్ సహాయకురాలు కారుచోలు భారతి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, మండల కో–ఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

గీతాంజలిలో నూతన ఉత్తేజం..

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గీతాంజలి రెసిడెన్షియల్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. విద్యా సంస్థల డైరెక్టర్ ఎం డ్లూరి శేషగిరిరావు, ప్రిన్సిపల్ టి.కృష్ణవేణి, వైఎల్.కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నరసరావుపేట: పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో సోమవారం ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంపీని సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

నాదెండ్ల: మండలంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను, చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడును, జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ జాన్‌సైదాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ తలతోటి రాణి పాల్గొన్నారు.

చిలకలూరిపేట: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు సోమవారం నిర్వహించారు. ఆయన కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేట: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గృహం, వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును ఎమ్మెల్యే గోపిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నరసరావుపేట: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని వారి కార్యాలయాల్లో కలిసి దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలను తెలియ చేశారు.



గజమాలతోఎమ్మెల్యే బొల్లాకు ఘనస్వాగతం పలుకుతున్న నేతలు



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న న్యాయవాది



ప్రజా ప్రతినిధులను సత్కరిస్తున్న ఎంపీడీవో



వేడుకల్లో గీతాంజలి విద్యార్థులు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



సమన్వయకర్త రాజేష్ నాయుడును అభినందిస్తున్న నాయకులు

శావల్యాపురంలో అభివృద్ధి పనులు



లింగాల వీధిలో సీసీ డ్రైయిన్స్



సీసీ రోడ్డు నిర్మాణ పనులు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామంలోని సమస్యల పరిష్కార దిశగా చర్యలు చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.10లక్షలతో 170 మీటర్ల సీసీ డ్రెయిన్స్, 120 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు పారదర్శకంగా చేసినట్లు ఏఈ వివరించారు. మండలంలోని అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేసినట్లు వివరించారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు, మండల కో–ఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేతలు జవంగుల బాబు, కొణతం ఏరుకలరెడ్డి, ముట్లూరి సత్యం, కొండారెడ్డి, పొట్టిపాటి శ్రీను తదితరులు ఉన్నారు.

మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ ప్రారంభం రేపు



ఇక్కుర్రులో మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్

రొంపిచర్ల: నరసరావుపేట నియోజకవర్గంలోని 9 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా నాబార్డు నిధులతో నిర్మిస్తున్న ఆరు మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ల నిర్మాణం పూర్తి అయ్యింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 20 మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ల నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అందులో 90 శాతం నాబార్డు నిధులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు 10 శాతం నిధులు సమకూర్చుకోవాల్సి ఉంది. ఒక్కొక్క సంఘంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి నాబార్డు రూ.40 లక్షలు అందజేస్తుండగా, సంఘం రూ.4 లక్షలు సమకూర్చుకుంటోంది. ఇక్కుర్రు పీఏసీఎస్‌లోని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకార భవన్ షాపింగ్ కాంప్లెక్స్ గోదాం, మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఈ నెల 3న మధ్యాహ్నం ప్రారంభించనున్నట్లు సంఘం చైర్‌పర్సన్ కన్నెబోయిన శ్రీనివాసరావు, సీఈవో కంటు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజిని, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీక్రిస్టినా, ఏపీ ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి మల్లెల ఝాన్సీరాణి, జీడీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మీ, కలెక్టర్ లోతేటి శివశంకర్, డీసీవో ఉదయగిరి నాగశ్రీనివాసరావు హాజరు కానున్నట్లు చెప్పారు.

అధ్యాపకుడు కోటిరెడ్డికి డాక్టరేట్ ప్రదానం



కోటిరెడ్డికి పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్

నర్సరావుపేట ఈస్ట్: కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు గాదె నాగకోటిరెడ్డికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.వీరయ్య, ప్రొఫెసర్ జి.నాగరాజు పర్యవేక్షణలో 'ది ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ సిల్వర్ అండ్ గోల్డ్ అయాన్స్ ఆన్ ది డైఎలక్ట్రిక్ డిస్పర్షన్ డైపోలార్ రిలాక్సేషన్ డైనమిక్స్ ఆఫ్ జింక్ సెలీనియం ఫాస్ఫేట్ గ్లాస్ సిరామిక్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు గాను కోటిరెడ్డికి పీహెచ్‌డీ లభించింది. వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ చేతుల మీదుగా కోటిరెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ భౌతికశాస్త్ర విభాగాధిపతి సంధ్యకోల్ పాల్గొన్నారు. కోటిరెడ్డి మాట్లాడుతూ ఎక్కువ కాలం పనిచేసేలా కృత్రిమ మేధలో ఉపయోగపడే బ్యాటరీలను తయారు చేయవచ్చని తెలిపారు. గ్లాస్ సిరామిక్స్ మెటీరియల్స్‌పై బంగారం, వెండి లోహాల ప్రభావంపై పరిశోధన కొనసాగిందన్నారు. తన పరిశోధనకు సహకరించిన వైస్‌చాన్సలర్ రాజశేఖర్, రిటైర్డ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి డాక్టర్ భవనం ఆంజనేయరెడ్డి, పర్యవేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కళాకారులను ప్రోత్సహించాలి



చిలకలూరిపేటటౌన్: కళాకారులను ప్రోత్సహించటం సామాజిక బాధ్యత అని తహసీల్దారు, రెడ్ క్రాస్ చిలకలూరిపేట శాఖ అధ్యక్షురాలు జి.సుజాత అన్నారు. సోమవారం పట్టణంలోని జంపని భాస్కరరావు సినీ కల్యాణ మండపంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న తహసీల్దారు మాట్లాడుతూ సమాజంలోని సామాజిక సమస్యలే ఇతి వృత్తాలుగా కళాకారులు ప్రదర్శనలు కొనసాగించాలని సూచించారు. సీనియర్ రెడ్ క్రాస్ సభ్యులకు సత్కరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకుడు జంపని భాస్కరరావు, ఏవీ శివయ్య పాల్గొన్నారు.

6,892 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా

శావల్యాపురం: వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా.. స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగో విడత రుణ మాఫీ నగదు ప్రభుత్వం ఈ నెలలో జమ చేయనున్నట్లు ఏపీఎం జి.వాసుబాబు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 24 గ్రామ సమాఖ్యా సంఘాలు ఉండగా 706 మహిళా గ్రూపుల్లో 6,892 సభ్యులకు సంబదించి బయోమెట్రిక్ పనులు పూర్తి చేశామన్నారు. సచివాలయాల వారిగా అర్హత సాధించిన మహిళాల జాబితాను ఈ నెల 4 వరకు ప్రదర్శిస్తామన్నారు. అభ్యంతరాలుంటే.. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో తప్పులు జరిగితే సవరణలు చేస్తున్నట్లు తెలిపారు. సీసీలు ఖాజావలీ, గొట్టం రమాదేవి, బేబిరాణి ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): అబ్దుల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సోమవారం యూటీఎఫ్ టెస్ట్ మోడల పేపర్స్ (స్టడీ మెటీరియల్)ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి పాల్గొని స్టడీ మెటీరియల్స్‌ను అందజేసి, మాట్లాడారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నకరికల్లు: ట్రాక్టర్ కిందపడి గాయాలపాలైన వృద్ధుడు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కుంభా సాంబయ్య(67) ట్రాక్టర్‌పై డ్రైవర్‌కు కుడివైపున ఇంజిన్‌పై కూర్చొని ప్రయాణిస్తున్నాడు. డ్రైవర్ అతివేగంగా ట్రాక్టర్‌ను నడపడంతో అదుపుతప్పి ట్రాక్టర్ కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ సోమవారం తెలిపారు.

వృక్షాంజనేయస్వామికి విశేష పూజలు



నకరికల్లులోని వృక్షాంజనేయస్వామి

నకరికల్లు: స్థానిక ఎన్నెస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వృక్షాంజనేయస్వామి వారికి సోమవారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు తుంగతుర్తి పాండురంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వయంభువుగా వెలసిన స్వామివారికి కుంకుమ, పసుపు, గంధం, పాలు, పెరుగు, నెయ్యి తదితర విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా భక్తసంఘం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలుప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

దాడిలో గాయపడిన కార్యకర్తలకు ఎమ్మెల్యే పరామర్శ



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేయడం దారుణమని, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు చేపడతామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఇటీవల బొల్లాపల్లి మండలం పలుకూరు తండాలో టీడీపీ నాయకుల దాడుల్లో గాయపడిన వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. వినుకొండ పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బంకా ఎల్లయ్య, పెద్దపోలయ్య, మంగమ్మ, ఒంటేరు పేరయ్య, పల్లెబోయిన నాగరాజుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నిజాయితీగా వైఎస్సార్ సీపీని ఎదుర్కొనలేక గ్రామాల్లో టీడీపీ నాయకులు చిన్నచిన్న విషయాలకు రెచ్చగొడుతూ దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. టీడీపీ నాయకులు గుంటూరు నుంచి రౌడీలను పిలిపించి పొలాల్లో పనులు చేసుకుంటున్న వారిపై దాడులకు దిగారని, గ్రామాల్లో టీడీపీ చేతకాని తనానికి ఈ దాడులే నిదర్శనమన్నారు. టీడీపీ దాడులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే చూస్తూ ఊరుకోమన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బొల్లాపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పలుకూరులో పోలీస్ పికెట్



బందోబస్తులో పోలీసులు

బొల్లాపల్లి: మండలంలోని పలుకూరు గ్రామంలో బండ్లమోటు పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై డి.చెన్నకేశవులు సోమవారం తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, ఎటువంటి ఘర్షణలకు దారితీయకుండా పోలీసులు పహారా కొనసాగుతుందని చెప్పారు. ఇరువర్గాలకు చెందిన సుమారు 8 మందికి గాయాలయ్యాయని తెలిపారు. వైఎస్సార్ సీపీకి చెందిన బంకా ఏల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, వీరు రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడ్డామని, టీడీపీకి చెందిన 27 మంది ఈ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పెర్కొన్నట్లు తెలిపారు. టీడీపీకి చెందిన సంపతి మల్లేశ్వరరావు వైఎస్సార్ సీపీకి చెందిన 14 మంది దాడిలో పాల్గొన్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇరువర్గాలు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామంలో శనివారం అర్ధరాత్రి వి.బ్రహ్మయ్య ఓ ఇంటి ముందు మూత్ర విసర్జన చేశాడనే ఆరోపణలతో వివాదం నెలకొంది. ఆదివారం వివాదం ఘర్షణకు దారితీసిందని ఎస్సై తెలిపారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు



అక్షింతలను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: అయోధ్య నుంచి చేరుకొన్న శ్రీరాముని పూజ అక్షింతలను సోమవారం శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని 29వ వార్డులో పంపిణీ చేపట్టారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అయోధ్య నుంచి 35 బ్యాగుల్లో వచ్చిన అక్షింతలను పట్టణంలోని 34వ వార్డులలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అక్షింతలు అందుకున్న వారు వాటిని తమ పూజా మందిరంలో ఉంచుకొని ఈ నెల 22న అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభం అనంతరం తమ తలపై వేసుకొని ఇంట్లో పంచ దీపాలను వెలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నా స్వరాజ్యలక్ష్మీ, పొట్టిమూర్తి రోజా, నాళం వెంకట మానస పాల్గొన్నారు.